క్లుప్తంగా

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెదపూడి: మండలంలోని పెద్దాడ, జి.మామిడాడల్లో ఖాళీగా ఉన్న నాలుగు వలంటీర్ పోస్టులకు ఈ నెల 21వ తేదీ నుంచి 23 వరకూ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ పి.విజయభాస్కర్ తెలిపారు. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అలరించిన స్త్రీ జూదం నాటిక


కొంకుదురులో ప్రదర్శించిన స్త్రీ జూదం నాటిక

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు మార్కెట్ సెంటర్ వద్ద గణపతి నవరాత్రుల్లో భాగంగా ప్రదర్శించిన స్త్రీ జూదం నాటిక అందరినీ అలరించింది. తన స్వేచ్ఛకు అడ్డొస్తున్నారంటూ పెద్దల అడ్డు తొలగించిన ఓ స్త్రీ తరువాత ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొందో నాటికలో కళ్లకు కట్టినట్లుగా చూపించారు. నాటికకు తాడి సుబ్బారెడ్డి దర్శకత్వం వహించగా, కర్రి రామారెడ్డి, శ్రీజ, చిన్నం వెంకట కృష్ణారెడ్డి, శ్రీనివాస్ తదితరులు నటించారు.

నేడు అనపర్తిలో 'జగనన్నకు చెబుదాం'

అనపర్తి: నియోజకవర్గ కేంద్రమైన అనపర్తిలో బుధవారం మండల స్థాయిలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎస్ఎస్ఆర్ ఫంక్షన్ హాలులో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ నిర్వహించే ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె.మాధవీలత, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు హాజరవుతారన్నారు.

పాఠశాలకు బీరువా వితరణ


పాఠశాలకు వితరణ చేసిన బీరువా

రాజానగరం: మండలంలోని రాధేయపాలెం ప్రాథమిక పాఠశాలకు ఆ స్కూలు ఎంటీఎస్ ఉపాధ్యాయుడు కొవ్వూరి బులిరెడ్డి తన తండ్రి ప్రకాష్ రెడ్డి జ్ఞాపకార్థం ఇనుప బీరువాను వితరణ చేశారు. పాఠశాలకు సంబంధించిన విలువైన రికార్డులను భద్రపర్చుకునేందుకు దీన్ని ఉపయోగించనున్నారు.

30లోపు ఫీజు చెల్లించాలి

రంగంపేట: ఇంటర్మీడియట్ ఫెయిలైన, మధ్యలో మానేసిన విద్యార్థులు వచ్చే ఏడాది మార్చిలో నిర్వహించే పరీక్షలకు ఈ నెల 30వ తేదీ లోపు ఫీజు చెల్లించాలని స్థానిక ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఈ మేరకు సెక్రటరీ బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ తాడేపల్లి నుంచి ఉత్తర్వులు అందాయన్నారు.

పాఠశాల వినియోగదారుల క్లబ్ ఏర్పాటు

బిక్కవోలు: మండలంలోని ఊలపల్లి ఉన్నత పాఠశాలలో 8, 9 తరగతుల విద్యార్థులతో వినియోగదారుల క్లబ్ ఏర్పాటుచేశారు. ప్రెసిడెంట్‌గా కె.కార్తీక్, వైస్ ప్రెసిడెంట్‌గా ఎస్ స్వాతి, కార్యదర్శిగా వై.జోగేశ్వరి, కోశాధికారిగా డి.గౌరి శంకర్, సభ్యులుగా జి.సాయి, పి.ఝాన్సీ, బన్నీ. కె.విజయదుర్గ, ఎం.సంతోషిని ఎన్నుకున్నారు. వినియోగదారులకు జరుగుతున్న అన్యాయాలను విద్యార్థులకు చిన్ననాటి నుంచి అవగాహన కల్పించడం కోసమే ఈ క్లబ్‌ను ఏర్పాటు చేసినట్లు హెచ్ఎం కొవ్వూరి అమ్మిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గొలుగూరి వెంకటరామారెడ్డి, చిన్నం వెంకటకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోరు, పైపులైన్ ఏర్పాటు

రంగంపేట: మండలంలోని సింగంపల్లి దేవికాలనీలో గల మంచినీటి పథకం బోరు మరమ్మతులకు గురై ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతుండటంతో కొత్తబోరు వేయించి పైపులైన్ నిర్మించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం బోరుకు మోటారును ఏర్పాటుచేశారు. బోరు కోసం రూ.7.50 లక్షలు మంజూరు చేయించిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి నల్లా శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తుట్టా శివశంకర్ ఆనంద్, ఉప సర్పంచ్ సోమిశెట్టి అప్పారావు, కొండేపూడి సతీష్ పాల్గొన్నారు.

చాగల్నాడు పంపులకు మరమ్మతులు

రాజానగరం: మెట్ట ప్రాంతం భూములకు గోదావరి జలాలను అందించే చాగల్నాడు ఎత్తిపోతల పథకానికి సంబంధించి మూడో స్టేజీలో పంపులు సమస్యలకు గురయ్యాయి. వెంటనే వాటిని గుర్తించి, సత్వరమే మరమ్మతులు చేసే విధంగా చర్యలు తీసుకున్నామని ఆ పథకం డీఈఈ శివప్రసాద్ తెలిపారు. కాకినాడలోని వర్క్‌షాప్‌నకు వాటిని తరలించి, మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. రాజానగరం, రంగంపేట మండలాలలోని ఖరీఫ్ ఆయకట్టుకు ఏమాత్రం నీటి ఎద్దడి రాకుండా ప్రయత్నిస్తున్నామన్నారు.

గౌరీ తనయా నమోస్తుతే..


రామేశ్వరంలో గాజులతో తయారుచేసిన వినాయకుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి


అనపర్తి మార్కండేయపురంలో వినాయకుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి


పందలపాక వెలమపేటలో కొలువైన వినాయకుడు

- వాడవాడలా కొలువుదీరిన గణనాథులు
- వైభవంగా వినాయక చవితి వేడుకలు

అనపర్తి/బిక్కవోలు/పెదపూడి: విఘ్నాలు తొలగించి విజయాలను ప్రసాదించే ఆదిదేవుడు వినాయకుడు బహురూపాల్లో భక్తులను కనువిందు చేశాడు. గణపతి నవరాత్ర వేడుకల్లో భాగంగా వాడవాడలా ఏర్పాటు చేసిన మండపాల్లో గజాననుని భారీ విగ్రహాలను కొలువుదీర్చిన భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. చిన్నా, పెద్దా తారతమ్యాలు లేకుండా వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. స్థానిక మార్కండేయపురంలో స్నేహ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణపతిని, భావనాఋషి, భద్రావతి సమేత దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో గణపతిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు, బలభద్రపురం, తొస్సిపూడి, కొమరిపాలెం, పందలపాక, కొంకుదురు, ఊలపల్లి తదితర గ్రామాల్లో గణపతి నవరాత్రులు ఘనంగా నిర్వహించారు. ఊరూరా మండపాలు ఏర్పాటుచేసి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించుకున్నారు. వినాయక చవితి సందర్భంగా ఇంటింటా పండగ వాతావరణం నెలకొంది.

పెదపూడి: మండలంలోని జి.మామిడాడ, శివారు పాటిమీద, పెదపూడి, రామేశ్వరం, ఏపీత్రయం, పెద్దాడ, సంపర, కాండ్రేగుల తదితర గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రామేశ్వరంలో సర్పంచ్ కొటికలపూడి చినబాబు, ఆదిలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో 15 అడుగుల ఎత్తులో రుద్రాక్షలతో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాన్ని ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి దర్శించుకున్నారు.

మధురపూడి: కోరుకొండ మండలంలో వినాయక చవితి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో వేడుకలు నిర్వహిస్తున్నారు. బూరుగుపూడి, గాడాల, కోరుకొండ గ్రామాల్లోని స్వామివారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

సీతానగరం మండలంలో..

సీతానగరం: మండలంలో గణపతి నవరాత్ర ఉత్సవాలు ఘనంగా మొదలయ్యాయి. దుర్గా భవాని వర్కర్స్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో సీతానగరం బస్టాండ్ సెంటర్ వద్ద గణపతి విగ్రహం నెలకొల్పారు. మండలంలోని పలు గ్రామాల్లో వేడుకలు నిర్వహిస్తున్నారు. కాగా.. విగ్రహాల నిమజ్జన సమయంలో ఉత్సవ కమిటీలు తప్పనిసరిగా రూట్‌మ్యాప్ అందజేయాలని ఎస్సై కె.చిరంజీవి సూచించారు. వంగలపూడి, పురుషోత్తపట్నం, ముగ్గళ్ల, ఇనుగంటివారిపేట, మునికూడలి, బొబ్బిల్లంక రేవుల్లో నిమజ్జనం చేయవచ్చన్నారు. అలాగే నిబంధనలు తప్పకుండా పాటించాలని ఆదేశించారు.


సీతానగరం బస్టాండ్ సెంటర్‌లో ఆటో యూనియన్ సభ్యులు ఏర్పాటు చేసిన గణనాథుడు

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- బలభద్రపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం


బలభద్రపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని బలభద్రపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ కుల, మత, పార్టీ, వర్గ బేధాలేవీ చూడకుండా అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలన్నది ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అభిమతమన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కోసం సీఎం నిరంతరం శ్రమిస్తున్నారని చెప్పారు. అనంతరం గ్రామంలో రూ.21 లక్షలతో చేపట్టిన వెలెనెస్ సెంటర్ ప్రారంభించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి కమిటీ అధ్యక్షుడు నల్లమిల్లి వెంకటరెడ్డి, సర్పంచ్ బుంగా రామారావు, ఎంపీటీసీ మేడపాటి ఆనందరెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, చిన్నం వీర్రాఘవరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి, సబ్బెళ్ల వీర్రాఘవరెడ్డి, నల్లమిల్లి రామచంద్రారెడ్డి, కొవ్వూరి సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న రాష్ట్ర శాప్ డైరెక్టర్ అలేఖ్య లాజరస్

అనపర్తి: క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై మక్కువ చూపాలని శాప్ డైరెక్టర్ అలేఖ్య లాజరస్ అన్నారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్) అండర్-14, 17 బాలికల నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు, సెలక్షన్స్‌ను రాష్ట్ర శాప్ డైరక్టర్ జి.అలేఖ్య లాజరస్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయన్నారు. ఈ నెల 21వ తేదీ వరకూ నియోజకవర్గ స్థాయి సెలక్షన్స్, 25, 26 తేదీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు స్పోర్ట్స్ కోఆర్డినేటర్ పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వారా కుమారి, ఎంపీటీసీ ఏడుకొండలు, ఎంఈఓ-2 నల్లమిల్లి సత్తిరెడ్డి, పాఠశాల హెచ్ఎం పులగం వెంకటరెడ్డి, వైబీఎస్ ఆచార్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తొర్రేడు హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్రస్థాయి విలువిద్య, స్విమ్మింగ్ పోటీలకు తొర్రేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని ప్రధానోపాధ్యాయుడు మేకా సాయిబాబు మంగళవారం ప్రకటనలో తెలిపారు. డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్‌లో నిర్వహించిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ విలువిద్య (ఆర్చరీ) పోటీలలో ఇండియన్ రౌండ్ విభాగంలో జిల్లాస్థాయి అండర్ 17 బాలురలో పి.యశ్వంత్ (9వ తరగతి) ప్రథమ, డి.పృథ్వీరాజ్ (10వ తరగతి) ద్వితీయ స్థానాల్లో, అండర్ 14 విభాగంలో ఎం.కార్తిక్ (8వ తరగతి) స్టాండ్‌బైగా, బాలికల విభాగం అండర్ 17లో రికర్వ్ విభాగంలో ఎస్‌కే నాజియా, అండర్ 14 విభాగంలో కె.అమూల్య రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారయ్యారు. స్విమ్మింగ్ అండర్ 17 విభాగం 100 మీటర్ల బ్యాక్‌లో ఐ.రవికిరణ్ (9వ తరగతి) రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు. ఆ విద్యార్థులను, ఫిజికల్ డైరెక్టర్ ఎం.కుమారిని అభినందించారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి

అనపర్తి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని రామవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశం కమిటీ చైర్మన్ గుడిమెట్ల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వాసుపత్రులను కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా తీర్చిదిద్దుతోందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సహకారంతో రామవరం పీహెచ్‌సీ నూతన భవన నిర్మాణం జరగడంతో ఆసుపత్రిలో 24 గంటలకు వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. విమర్శలకు తావులేకుండా రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గిరడా గంగాభవాని, ఎంపీటీసీలు నల్లమిల్లి భాగ్యలక్ష్మి, గొలుగూరి గౌతమి, పీహెచ్ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- పుణ్యక్షేత్రంలో గడపగడపకూ..


పుణ్యక్షేత్రంలో ప్రభుత్వ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: 'ఏమ్మా.. ఏం చేస్తున్నారు, పింఛను వస్తుందా తాతా.. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా.. సీఎం జగన్ అందిస్తున్న పాలన ఏవిధంగా ఉంది, ప్రభుత్వం నుంచి మీరు ఇంకా ఏమైనా కోరుకుంటున్నారా..' అంటూ స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ప్రజలను కుశల ప్రశ్నలు వేసి, వారి యోగ క్షేమాలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. మండలంలోని పుణ్యక్షేత్రంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం రెండోరోజు కొనసాగింది. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి, గడచిన నాలుగున్నరేళ్లలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన ప్రయోజనాలను వివరిస్తూ, ప్రభుత్వ పాలనపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. గతంలో ఏ చిన్నపాటి పని చేయించుకోవాలన్నా అనేక ఇబ్బందులు పడేవారమని, ఇప్పుడు ఆ ఇబ్బందులు లేకుండా వలంటీర్లు ఇంటికే వచ్చి తమ సమస్యలు తెలుసుకుని, పరిష్కారం చూపుతున్నారని పలువురు గృహిణులు తెలిపారు. ఎటువంటి సర్టిఫికెట్ కావాలన్నా గ్రామ సచివాలయాల్లోనే ఇస్తున్నారన్నారు. జన్మభూమి కమిటీల వంటి దళారుల బెడద తప్పిందంటూ ఆనందాన్ని వ్యక్తపరిచారు. నిరంతరం ప్రజలు బాగుండాలని కోరుకునే మీలాంటి, జగన్ లాంటి వారే మాకు లీడర్లుగా ఉండాలని కోరుకుంటున్నామంటూ సంతోషం వ్యక్తం చేశారు.

అభివృద్ధికి రూ. 8.28 కోట్లు

మండలంలోని భూపాలపట్నం - పుణ్యక్షేత్రం గ్రామాల అభివృద్ధికి గడచిన నాలుగున్నరేళ్లలో రూ.8.28 కోట్లు వెచ్చించామని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. అదే చంద్రబాబు అధికారంలో ఉన్న ఐదేళ్లలో కేవలం రూ.1.39 కోట్లు మాత్రమే ఖర్చు చేశారన్నారు. గడచిన నాలుగున్నరేళ్లలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా 7,560 మందికి రూ.9,73,68,982 ఆర్థిక ప్రయోజనం కల్పించామన్నారు. పుణ్యక్షేత్రంలో సుమారు 300 మంది పేదలకు నివాస స్థలాలు పంపిణీ చేసి, పక్కా ఇల్లు కట్టించే ఏర్పాట్లు చేశామన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక గ్రామాల రూపురేఖలే మారిపోతున్నాయని, ప్రభుత్వ బడులు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా విద్యను అందిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, వైఎస్సార్ సీపీ మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, సర్పంచ్ మరుకుర్తి వెంకటేశ్వర్రావు, ఎంపీటీసీ పలివెల వెంకట్రావు, నాయకులు గంగిశెట్టి సోమేశ్వర్రావు, పేపకాయల రాంబాబు, పేపకాయల ఈశ్వర్రావు, వీరబాబు పాల్గొన్నారు.

బ్లేడ్ బ్యాచ్ సభ్యులపై నిఘా పెట్టండి


కేసుల వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ జగదీష్

ధవళేశ్వరం: బ్లేడ్ బ్యాచ్ సభ్యులపై నిఘా పెట్టాలని ధవళేశ్వరం పోలీసులకు ఎస్పీ పి.జగదీష్ ఆదేశించారు. ఆయన మంగళవారం సాయంత్రం ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ కె.మంగాదేవి ఎస్పీకి ఘన స్వాగతం పలికారు. కేసుల నమోదు, ప్రగతిపై ఎస్పీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. బ్లేడ్ బ్యాచ్ సభ్యుల కదలికలపై నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు సాగించే ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. జాతీయ రహదారిపై ప్రమాద ప్రాంతాలను గుర్తించి, ప్రమాదాల నివారణకు చర్యలను చేపట్టాలన్నారు. ఎస్సైలు ఎం.కేశవరావు, వి.క్రాంతికుమార్, ఏఎస్సై నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గ్యాస్ సిలెండర్లు స్వాధీనం

కంబాలచెరువు: మోరంపూడి చైతన్య నగర్‌లోని దుర్గాదేవి ఫుడ్ పాయింట్‌పై మంగళవారం విజిలెన్స్ అధికారులు దాడి చేశారు. అక్కడ గృహావసరాలకు వాడే ఆరు డొమెస్టిక్ సిలిండర్లను కనుగొన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని హోటల్ యజమాని యెల్లిపిల్లి సత్యమూర్తిపై కేసు నమోదు చేశారు. రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌చార్జి అధికారి కె.కుమార్ మాట్లాడుతూ గృహావసరాలకు వాడే గ్యాస్ సిలెండర్లను వ్యాపారాలకు ఉపయోగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. తనిఖీల్లో కార్యాలయ సబ్ ఇన్‌స్పెక్టర్ జగన్నాథరెడ్డి, జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ, హెడ్ కానిస్టేబుల్ జీవానందం, కానిస్టేబుల్ లోవకుమార్, రెవెన్యూ, సివిల్ సప్లయ్ అధికారులు పాల్గొన్నారు.

చోరీ చేశారు.. కెమెరాకు దొరికారు..

రంగంపేట: మండలంలోని కోటపాడులో ఉన్న మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో చోరీ జరిగినట్లు ఆలయ కమిటీ చైర్మన్ పచ్చిపాల నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. ఇద్దరు వ్యక్తులు గునపంతో గుడి తలుపుల తాళాలు పగలగొట్టి లోపలున్న హుండీ అపహరించుకుపోయినట్లుగా ఆలయ ఆవరణలో అమర్చిన సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యిందన్నారు. ఆ దృశ్యాల ఆధారంగా వారిద్దరూ పెద్దాపురం మండలం సిరివాడ గ్రామానికి చెందిన మారిసీడి పెద పుల్లయ్య, కాండ్రకోట గ్రామానికి చెందిన పోతుల సుందర్‌కుమార్‌లుగా గుర్తించామన్నారు. వారిద్దరినీ మంగళవారం ఉదయం 11.30 గంటలకు కోటపాడు గ్రామ శివారు నాయకంపల్లి జంక్షన్ వద్ద అరెస్ట్ చేసి వారి నుంచి రూ.15 వేలు, హుండీని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ రామకృష్ణ చెప్పారు.

ఎమ్మార్పీఎస్ రిలే నిరాహార దీక్షలు

గోకవరం: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీవర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గెద్దం అనిల్, మండల నాయకులు చింతాటి శ్రీను, మోర్త డానియల్, డోకుబుర్ర విజయ్ తదితరులు పాల్గొన్నారు.

చంటియ్య సేవలు అభినందనీయం

కడియం: ఇటీవల గౌరవ డాక్టరేట్ అందుకున్న సత్యదేవ నర్సరీ అధినేత పుల్లా చంటియ్యను వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ మంగళవారం అభినందించారు. స్వయంగా చంటియ్యను కలిసిన చందన శాలువాతో సత్కరించారు. నర్సరీ రంగంలో చంటియ్య సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణుచక్రవర్తి, పార్టీ నాయకులు కొత్తపల్లి శివాజీ, సింగంశెట్టి శ్రీను, తిరుమలశెట్టి వాసు తదితరులు ఉన్నారు.

ఆరోగ్య సురక్షను విజయవంతం చేయాలి


జి.మామిడాడలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే రిపోర్టును పరిశీలిస్తున్న డీఐఓ రత్నకుమార్

పెదపూడి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాకినాడ జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి కె.రత్నకుమార్ అన్నారు. జి.మామిడాడలో చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే రిపోర్టులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్లు, వలంటీర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు అందరూ సర్వేను బాధ్యతగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పెద్దాడ పీహెచ్‌సీ అధికారి సురేఖ తదితరులు పాల్గొన్నారు.

గోకవరం: మండలంలో బుధవారం నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ కె.పద్మాజ్యోతి వైద్య సిబ్బంది, వలంటీర్లు, ఆశ కార్యకర్తలను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈనెల 30 వరకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు జరుగుతాయని ఎంపీడీఓ తెలిపారు. ఈఓపీఆర్‌డీ రాజేశ్వరరావు, ఎంపీహెచ్ఈఓ మూర్తి, కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావు, ఎస్‌టీఎస్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది పవన్ తదితరులు పాల్గొన్నారు.

చకచకా ప్రహరీల నిర్మాణం


కణుపూరులో నిర్మిస్తున్న రక్షణ గోడ

మధురపూడి: కోరుకొండ మండలంలోని 18 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రహరీల నిర్మాణం వేగంగా జరుగుతోంది. వాటిలో కణుపూరు, కోటి కేశవరం, కోటి, రాఘవపురం, నర్సాపురం హైస్కూళ్లతో పాటు, 13 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఇప్పటికే గుమ్ములూరు, దోసకాయలపల్లి హైస్కూళ్లలో నిర్మాణాలు పూర్తయ్యాయి.

అలరించిన కోలాటం


రాజానగరంలో కోలాట ప్రదర్శన

రాజానగరం: వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా స్థానిక గాంధీ బొమ్మ సెంటర్‌లోని లక్ష్మీ గణపతి ఆలయం వద్ద చిన్నారులు చేసిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. 59వ వార్షికోత్సవ వేడుకలలో భాగంగా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపంలో తొమ్మిది రోజులూ పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆఖరి రోజు భారీ ఎత్తున అన్న సమారాధన నిర్వహించనున్నారు.

కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి


కాలనీవాసులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేత సుంకర వీరబాబు, ఎంపీడీఓ పద్మాజ్యోతి

గోకవరం: గుమ్మళ్లదొడ్డిలో జగనన్న కాలనీని ఎంపీడీఓ పద్మాజ్యోతి, పలు శాఖల అధికారులతో కలిసి వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా కాలనీలో సమస్యలను పలువురు వీరబాబు దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని ఆయన కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఈఓపీఆర్‌డీ రాజేశ్వరరావు, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

సీతానగరం: రఘుదేవపురం పంచాయతీ పరిధిలోని రవీంద్ర కాలనీకి చెందిన బాలిక ఫిర్యాదు మేరకు పాడి శ్రీనుపై పోక్సో కేసు నమోదు చేశామని ఎస్సై కె.చిరంజీవి మంగళవారం తెలిపారు. ఆ బాలికను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని శ్రీను నమ్మించి మోసం చేశాడు. దీనిపై నార్త్‌జోన్ డీఎస్పీ విచారణ చేస్తారని ఎస్సై చిరంజీవి తెలిపారు.

సైనిక్ క్యాంప్‌నకు ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు

కంబాలచెరువు: ఢిల్లీలో జరిగే ఆల్ ఇండియా థల సైనిక్ క్యాంప్‌నకు ఎనిమిది మంది ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ ఈసుబ్ బాషా షేక్ మంగళవారం ఆ వివరాలు తెలిపారు. కళాశాలకు చెందిన విధేయ్, సత్యనారాయణ, అఖిల్, హరి వీరేంద్ర, అలేఖ్య, ఉషారాణి, అరుణ, భవానీ ఎంపికయ్యారన్నారు. మూడు నెలలుగా రాజమండ్రి, కాకినాడ, పెద్దాపురం, అనంతపురం, తిరుపతి, సికింద్రాబాద్‌లో జరిగిన ఫైరింగ్, అబ్‌స్టాకిల్ ట్రైనింగ్, తక్కువ సమయంలో సైనిక గుడారాలను ఏర్పాటు చేయడం, ఆరోగ్యం, పరిశుభ్రత వంటి ఆర్మీలోని వివిధ అంశాల్లో అనేక కఠిన వడపోతల తరువాత ఈ శిబిరానికి ఎంపికయ్యారన్నారు.